
సాక్షి మెదక్

బుధవారం, 3, ఏప్రిల్, 2024




సాగు నీటి రాజకీయం

తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి కొండపాక మండలానికి సాగు నీరు అందించడంలో కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న గ్రూప్ విభేదాలు రైతులను అయోమయానికి గురి చేస్తున్నాయి. వివరాలు 8లో ▸



బడ్జెట్ కేటాయింపు ఏదీ?

రాష్ట్ర వ్యాప్తంగా రాయితీ గడ్డి విత్తనాల పంపిణీ సరఫరా కాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివరాలు 8లో ▸



న్యూస్‌రీల్

నాణ్యత ప్రమాణాలు పాటించాలి

అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్ కలెక్టరేట్: ధాన్యం కొనుగోలు విషయంలో తప్పనిసరిగా నాణ్యత ప్రమాణాలు పాటించాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో పీఏసీఎస్ సొసైటీ సీఈఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, రికార్డులు, రిజిస్టర్లు సరైన క్రమంలో నమోదు చేయాలని ఆదేశించారు. ట్యాగ్ చేసిన మిల్లుకే ధాన్యం వెళ్లేలా చూడాలని, రైతులకు కొనుగోలు కేంద్రాల వద్ద కనీస వసతులు కల్పించాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ అధికారులు బ్రహ్మారావు, హరికృష్ణ, కరుణ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న రూ.5.83 లక్షలు స్వాధీనం



పట్టుబడిన నగదును చూపుతున్న ఎస్ఐ ఆనంద్‌గౌడ్

హవేళిఘణాపూర్(మెదక్): మండల కేంద్రంలో కారులో అనుమతి లేకుండా తరలిస్తున్న రూ.5.83 నగదును పట్టుకున్నట్లు ఎస్ఐ ఆనంద్‌గౌడ్ తెలిపారు. మంగళవారం ఎస్ఐ మాట్లాడుతూ.. వాహనాలను తనిఖీ చేస్తుండగా ఎల్లారెడ్డి వైపు నుంచి వస్తున్న కారులో నగదు పట్టుబడినట్లు చెప్పారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎవరైనా రూ.50వేలకు మించి నగదును తరలించవద్దని పేర్కొన్నారు. పట్టుబడిన నగదును సరైన ఆధారాలుంటేనే తీసుకెళ్లవచ్చని సూచించారు.

పెద్దశంకరంపేటలో రూ. 2.20 లక్షలు

పెద్దశంకరంపేట(మెదక్): ఎలాంటి అనుమతులు లేకుండా వాహనంలో తరలిస్తున్న నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కోళపల్లి చెక్‌పోస్టు వద్ద వాహనాలను ఎస్ఐ శంకర్ తనిఖీ చేస్తుండగా ఈశ్వరయ్య అనే వ్యక్తి ఎలాంటి అనుమతి లేకుండా రూ. 2 లక్షల 20 వేల నగదును తీసుకెళ్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

బీజేపీ జిల్లా ప్రతినిధిగా నరేందర్‌రెడ్డి



మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కూచారం గ్రామానికి చెందిన జక్కిడి నరేందర్‌రెడ్డిని జిల్లా బీజేపీ ప్రతినిధిగా నియమించారు. మంగళవారం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తనను జిల్లా ప్రతినిధిగా నియమించినందుకు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు, పార్లమెంట్ కన్వీనర్ రామ్మోహన్‌గౌడ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి నిరంతరం పాటుపడతానన్నారు.

విత్తనాలతో మోసపోతే ఫిర్యాదు చేయండి

జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ లక్ష్మీశారద



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

హవేళిఘణాపూర్(మెదక్): రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో కాలం చెల్లిన విత్తనాలను కొనుగోలు చేసి మోసపోకూడదని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ లక్ష్మీశారద అన్నారు. మంగళవారం మెదక్ మండల పరిధిలోని పాతూర్ గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. ఎవరైనా రైతులు నకిలీ విత్తనాలతో నష్టపోతే జిల్లా వినియోగదారుల ఫోరానికి ఫిర్యాదు చేస్తే తగిన నష్టపరిహారంతో పాటు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. లోక్‌అదాలత్ ద్వారా రూ.3లక్షల ఆదాయం ఉన్న వారికి ఉచిత న్యాయ సేవలందించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు పోలీస్‌స్టేషన్‌లో కేసులు పెట్టుకొని అవి పరిష్కారం కాకపోతే లోక్‌అదాలత్‌కు వస్తే వాటిని పరిశీలించి ఇరువురికి న్యాయం చేస్తామన్నారు. మైనర్లు వాహనాలు నడుపడం వల్ల జరిగే ప్రమాదాలకు వారి తల్లిదండ్రులే బాధ్యత వహించాలన్నారు. అడ్వకేట్లు కరుణాకర్, వివకుమార్, విజయ్, అనీస్‌బేగం, తదితరులు ఉన్నారు.

మద్దతు కోసం పాట్లు

ప్రధాన పార్టీల అభ్యర్థులు బిజీబిజీ

- సభలు, సమావేశాల నిర్వహణ
- గెలుపునకు సహకరించాలని వేడుకోలు
- సొంత పార్టీ నాయకులను ప్రసన్నం చేసుకుంటున్న అభ్యర్థులు



మెదక్‌జోన్: లోక్‌సభ సమరానికి ప్రధాన పార్టీలు సై అంటున్నాయి. ఇప్పటికే అభ్యర్థులను ఖరారు చేశాయి. బీజేపీ అభ్యర్థిగా రఘునందర్‌రావు, బీఆర్ఎస్ అభ్యర్థిగా మాజీ ఐఏఎస్ వెంకట్రామిరెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా నీలం మధును ప్రకటించాయి. ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచారంలో నిమగ్నమయ్యారు. సభలు, సమావేశాలతో బిజీబిజీగా మారారు. ఉమ్మడి జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కార్యకర్తలు, ముఖ్యనేతలను కలుస్తూ మద్దతును కూడగట్టుకుంటున్నారు. పార్టీలపై అలక వహించిన వారి ఇళ్లకు వెళ్లి ప్రసన్నం చేసుకుంటున్నారు.

పక్కా వ్యూహంతో బీఆర్ఎస్

బీఆర్ఎస్ పక్కా వ్యూహంతో ముందుకు సాగుతోంది. లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ముఖ్య కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేస్తూ అధికార పార్టీ కాంగ్రెస్‌ను టార్గెట్ చేస్తోంది. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు ఎక్కడ అమలయ్యాయని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఎండగడుతూ ప్రజలు, రైతుల మద్దతు కూడగట్టుకుంటుంది. ప్రభుత్వ విధానాన్ని నిలదీయాలని కార్యకర్తలకు హరీశ్‌రావు దిశానిర్దేశం చేస్తున్నారు. పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు గానూ 6 స్థానాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే గెలుపొందారని, కేవలం 10 వేల ఓట్ల తేడాతో మెదక్ సీటు చేజారిందని, ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని హరీశ్ వివరిస్తున్నారు.

ఇన్‌చార్జిల నియామకం

ఇప్పటికే మెదక్ లోక్‌సభ పరిధిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఇన్‌చార్జీలను నియమించాయి. బీఆర్ఎస్ మెదక్ లోక్‌సభ ఇన్‌చార్జిగా సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా మంత్రి కొండా సురేఖను నియమించాయి. బీజేపీ మాత్రం ఇప్పటి వరకు ఎవరిని ప్రకటించలేదు.

నేతలను కలుస్తున్న నీలం మధు

కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు మెదక్ లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ముఖ్య నేతలను, కార్యకర్తలను కలుస్తున్నారు. వారిని ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో నీలం మధు పటాన్‌చెరువు నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశించి భంగపడి.. చివరి క్షణంలో బీఎస్పీ నుంచి బరిలో దిగిన విషయం విదితమే. కాంగ్రెస్ బీ ఫామ్‌పై కాట శ్రీనివాస్ బరిలో నిలువగా.. బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మరోసారి గెలుపొందారు. 50వేలు ఓట్లు సాధించిన నీలం మధు.. ఆ ఎన్నికల్లో మూడో స్థానంలో నిలిచారు. ఎంపీ టిక్కెట్‌ను దక్కించుకున్న నీలం తనకు మద్దతు ఇవ్వాలని కాటా శ్రీనివాస్‌తో పాటు ముఖ్య నాయకులు, కార్యకర్తలను కోరుతున్నారు.

మోదీ చరిష్మాతో ముందుకు..

బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు 2019 లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేశారు. ఆయన మెదక్ నుంచి ఎంపీగా పోటీచేయటం ఇది రెండోసారి. ఆయన అభ్యర్థిత్వం ఖరారు కాగానే నియోజకవర్గాల వారీగా విస్తృతంగా పర్యటిస్తున్నారు. కార్యకర్తలను కలుస్తూ బీజేపీ గెలుపునకు శ్రమించాలని వివరిస్తున్నారు. బీఆర్ఎస్‌పై విమర్శనాస్త్రాలు గుప్పిస్తూ.. అయోధ్యలో రామాలయం గుడి నిర్మాణం, ఇంటింటికి అక్షింతలు, కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. ప్రదాని మోదీ చరిష్మాను ఆయుధంగా ప్రచారం చేస్తూ ముందుకు వెళ్తున్నారు.



కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్ కార్యదర్శులతో సమీక్షిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

రెండు రోజుల్లో ప్రణాళిక సిద్ధం

- తాగునీటి సమస్యలు తలెత్తొద్దు
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్
- కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ కలెక్టరేట్: పెరుగుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో తాగునీటి సమస్యల పరిష్కారానికి చేపట్టే చర్యలపై ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునిటి సమస్యకు ఆస్కారం ఉన్న గ్రామాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో అధికారులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. అధికారులు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలని సూచించారు. రెండు రోజుల్లో ప్రణాళిక తయారుచేసి అందజేయాలని, పర్యవేక్షణ కోసం కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్‌రూం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. గడపగడపకు మిషన్ భగీరథ నీరు సరఫరా అయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు.

నివేదిక అందుబాటులో ఉండాలి

గ్రామాలలో ప్రజలకు ఎంత నీరు అవసరం, ఓహెచ్ఎస్ఆర్ వాటర్ ట్యాంకుల సామర్థ్యం ఎంత, ఎంత కాలంటో ట్యాంకులు నింపవచ్చు అనే అంశాలపై ప్రతి పంచాయతీ కార్యదర్శికి అవగాహన ఉండాలని కలెక్టర్ చెప్పారు. అలాగే ప్రైవేటు బోర్లు, బావుల సమాచారం అందుబాటులో ఉండాలని, అత్యవసర పరిస్థితులలో వాటి ద్వారా ప్రజలకు నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. ఎక్కడైనా తాగునీటి సరఫరాలో ఇబ్బంది వస్తే తక్షణమే తన దృష్టికి తేవాలన్నారు. అలాగే ఉపాధి హామీ కూలీలతో ఉదయం 6 నుంచి 11వరకు మాత్రమే పని చేయించాలని, పనులు జరిగే ప్రదేశాల్లో తాగునీరు, టెంట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు కచ్చితంగా అందుబాటులో ఉంచాలని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రమేశ్, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి శ్రీరామ్, డీఆర్డీఓ శ్రీనివాస్‌రావు, డీపీఓ యాదయ్య, మిషన్ భగీరథ ఈఈ కమలాకర్, పంచాయతీ సెక్రెటరీలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు



కలెక్టర్‌కు వినతిపత్రంలో అందజేస్తున్న పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే సునీతారెడ్డి తదితరులు

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మ

మెదక్ మున్సిపాలిటీ: రాష్ట్రంలో కరువు సాధారణంగా వచ్చింది కాదు, కాంగ్రెస్ పార్టీ తెచ్చిందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో జెడ్పీ చైర్ పర్సన్ హేమలత, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డితో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం క్వింటాలు ధాన్యంపై రూ.500 బోనస్ ఇస్తే రైతులకు కొంత ఊరట లభిస్తుందన్నారు. ప్రభుత్వం తీరు చూస్తుంటే ఈ సీజన్లో బోనస్ అమలు కష్టమేనని తెలుస్తోందన్నారు. వంద రోజుల్లో హామీలను నెరవేరుస్తామని చెప్పి అధికారంలోకి వచ్చారని, ఇప్పుడు నాలుగు నెలలు గడుస్తున్నా ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు పక్షపాతి అని, వారి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారని గుర్తుచేశారు. ఈ ప్రభుత్వ పాలనలో వారు దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం రైతు సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ రాహుల్ రాజ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్ పర్సన్ లావణ్య రెడ్డి, ఎంపీపీల ఫోరం అధ్యక్షుడు హరికృష్ణ, పార్టీ పట్టణ అధ్యక్షులు గంగాధర్, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ, గ్రంథాలయ చైర్మన్లు బట్టి జగపతి, చంద్ర గౌడ్ మాజీ రైతుబంధు అధ్యక్షుడు సోములు, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

96 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

మెదక్ కలెక్టరేట్: యాసంగిలో రైతులు పండించిన వరి ధాన్యం కొనుగోలు చేసేందుకు ఐకేపీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 96 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఏపీఎంలు, సీసీలు, టాబ్ ఆపరేటర్లకు ధాన్యం కొనుగోలుపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వేసవికాలం దృష్ట్యా రైతులకు నీడ, నీరు ఏర్పాటు చేయాల న్నారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలు పాటించాలని, ట్యాగ్ చేసిన మిల్లులకు మాత్రమే ధాన్యం పంపాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లయ్ అధికారులు బ్రహ్మ రావు, హరికృష్ణ , అడిషనల్ డీఆర్డీఓ సరస్వతి, డీపీఎంలు, డీపీఎంలు, మోహన్, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన జడ్జి



బాధిత మహిళతో మాట్లాడుతున్న జడ్జి కె.అనిత

- అనారోగ్యంతో అంధురాలు..
- నాలుగు రోజులుగా జాడలేని భర్త
- చేసేదిలేక మట్టి తిని జీవిస్తున్న మహిళ
- తక్షణం వైద్యం అందేలా చర్యలు

నర్సాపూర్: అసలే అంధురాలు.. అనారోగ్యంతో బాధపడుతోంది. నాలుగు రోజులుగా భర్త ఎటు వెళ్లాడో తెలియదు.. చేసేదిలేక మట్టి తిని జీవిస్తున్న అభాగ్యురాలి దీనస్థితిని స్వయంగా చూసి సివిల్ జడ్జి చలించారు. తక్షణం వైద్యం అందేలా చర్యలు తీసుకుని మానవత్వం చాటారు. నర్సాపూర్‌లోని దివ్యాంగుల వసతి గృహంలో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. స్థానిక జూనియర్ సివిల్ కోర్టు సమీపంలోని దివ్యాంగుల వసతి గృహంలో శ్రీనివాస్, సంతోష(అంధురాలు) దంపతులు నివసిస్తున్నారు. శ్రీనివాస్ ఓ హోటల్‌లో వర్కర్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల అతని భార్య అనారోగ్యంతో బాధపడుతోంది.

జడ్జి దృష్టికి దీనస్థితి..

అయితే ఆమె భర్త నాలుగు రోజులుగా రావడంలేదని, ఆలనా పాలనా చూడటంలేదని మండల లీగల్ సర్వీస్ కౌన్సిల్‌న్యాయవాది స్వరూప జడ్జి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వెంటనే స్పందించిన జడ్జి స్థానిక ఎస్ఐ పుష్పరాజ్, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ మీర్జా నజీంబేగ్‌తో కలిసి బాధిత మహిళ ఉంటున్న వసతి గృహం వద్దకు వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అక్కడే ఉంటున్న వారితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సంతోష భర్త శ్రీనివాస్ నాలుగు రోజుల నుంచి ఇక్కడికి రావడం లేదని, ఆమె ఆలన పాలన పట్టించుకోవడం లేదని వారు వివరించారు. బాధిత మహిళకు కళ్లు కన్పించవని, ఆమె మట్టి తింటోందని జడ్జికి చెప్పారు. సంతోష దీన పరిస్థితి చూసి చలించిన జడ్జి కె.అనిత స్పందిస్తూ నిరాధరణకు గురైన అనారోగ్యంతో ఉన్న సంతోషకు వైద్యం అందించాలని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడికి సూచించారు.బాధిత మహిళ భర్త కోసం కూడా ఆరా తీయాలని ఎస్ఐకి ఆదేశించారు. వెంటనే మహిళను ఆస్పత్రికి తరలించి వైద్యం ప్రారంభించారు. జడ్జి మానవత్వం చాటడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.



కొడిపల్లి: పండ్లతోటల పెంపకంపై క్షేత్రస్థాయిలో శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్తలు

పట్టు పురుగులతో లాభాలు

జిల్లా హార్టికల్చర్ అధికారి నర్సయ్య

కౌడిపల్లి(నర్సాపూర్): రైతులు పట్టుపురుగుల పెంపకంతో అధిక ఆదాయం పొందవచ్చని హార్టికల్చర్ అధికారి నర్సయ్య తెలిపారు. మంగళవారం కౌడిపల్లి మండలంలో తునికివద్దగల కేవీకే (కృషి విజ్ఞాన కేంద్రం)లో సాంకేతిక వారోత్సవాలలో భాగంగా ఎస్సీ సబ్‌ప్లాన్ ద్వారా జిల్లాలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులకు మంగళవారం రెండో రోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టుపురుగుల పెంపకం వల్ల రైతులకు మంచి ఆదాయం వస్తుందన్నారు. ప్రభుత్వం సబ్సిడీ సైతం ఇస్తుందన్నారు. రైతులు సాంప్రదాయ పంటలకు బదులుగా పంట మార్పిడి చేసి కూరగాయలు, ఆకుకూరలు, పందిరిసాగు ద్వారా తీగజాతి కూరగాయల సాగుతో మంచి లాభాలు పొందవచ్చని చెప్పారు. వ్యవసాయ యాంత్రికరణ శాస్త్రవేత్త ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ సాగులో యంత్రాలను వాడటంవల్ల కూలీల కొరతను తగ్గించవచ్చని చెప్పారు. దీంతో ఖర్చు, సమయం ఆదా అవుతుందన్నారు. వరిలో వెద జల్లే పద్ధతితో విత్తనం, కూలీల ఖర్చు తగ్గుతుందని చెప్పారు. అనంతరం రైతులకు క్షేత్రస్థాయిలో బొప్పాయి పంటసాగు గురించి వివరించారు. కార్యక్రమంలో కేవీకే హెడ్, సైంటిస్ట్ నల్కర్, ప్రోగ్రాం కోఆర్డినేటర్, సైంటిస్ట్ ఎం శ్రీనివాస్, శాస్త్రవేత్తలు రవికుమార్, ఉదయ్‌కుమార్, డాక్టర్ ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏడేళ్లు.. ఒకే కార్యాలయం

- మిగతావి పట్టించుకోని అధికారులు
- ఐదేళ్ల క్రితం డీఎస్పీ ఆఫీస్‌కు భవన పరిశీలన
- మొక్కుబడిగానే రెవెన్యూ డివిజన్ ఏర్పాటు



నర్సాపూర్‌లోని ఆర్‌డీఓ కార్యాలయ భవనం

నర్సాపూర్: నర్సాపూర్‌ను రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసి ఏడేళ్లవుతున్నా ఒకే ఒక్క ఆర్డీఓ కార్యాలయమే ప్రారంభించారు. ఇతర శాఖల కార్యాలయాలు ఏర్పాటు చేయనందున డివిజన్ ఏర్పాటు మొక్కుబడిగా చేశారనే విమర్శలు వస్తున్నాయి. పంచాయితీ రాజ్, మిషన్ భగీరథ, సాగునీటి పారుదల శాఖలకు చెందిన డివిజన్ అధికారి కార్యాలయాలతో పాటు సబ్ కోర్టు, సబ్ జైలు, డీఎస్పీ కార్యాలయం ఏర్పాటు చేయాలన్న నిబంధనలు ఉన్నాయి. వాటిని ప్రభుత్వం పాటించడం లేదు. పోలీసు శాఖ అధికారులు డీఎస్పీ ఆఫీసు ఏర్పాటు చేసేందుకు సుమారు ఐదేళ్ల క్రితం నర్సాపూర్ పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల భవనాలు పరిశీలించారు. ఐదేళ్లు గడుస్తున్నా ఇంత వరకు అతీగతీ లేదు. ఆయా కేసులలో డీఎస్పీతో చర్చించాల్సి వస్తే డివిజన్‌లోని పలు మండలాల ప్రజలు తూప్రాన్‌కు వెళ్లాల్సి వస్తుంది. దీంతో సమయంతో పాటు ఆర్థిక భారం ప్రజలపై పడుతుంది. డివిజన్ కేంద్రంలో సబ్‌కోర్టు, సబ్ జైలు, ఆయా ఇంజనీరింగు శాఖలకు చెందిన డివిజన్ స్థాయి కార్యాలయాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇవి సైతం ఏర్పాటు చేయడం లేదు. సబ్‌కోర్టు ఏర్పాటు చేయనందున ఈ ప్రాంత ప్రజలు సబ్ కోర్టుకు వెల్లాలంటే మెదక్‌కు వెళ్లాల్సి వస్తోంది. కాగా న్యాయవాదులు, కక్షిదారులు సమయంతో పాటు ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టే చిన్న కాంట్రాక్టర్లు తమ బిల్లుల కోసం డివిజన్ స్థాయి ఇంజనీరింగ్ శాఖల కార్యాలయాలు నర్సాపూర్‌లో లేనందున మెదక్ వెళ్లాల్సి రావడంతో చాలా ఇబ్బందుల పాలవుతున్నామని చెబుతున్నారు. కాగా నిబంధనల మేరకు రెవెన్యూ డివిజన్ కేంద్రంలో ఉండాల్సిన ఆయా ప్రభుత్వ శాఖల కార్యాలయాలను ఏర్పాటు చేసి డివిజన్ కేంద్రానికి పూర్తి స్థాయి సార్థకత కల్పించి డివిజన్‌లోని ఆయా గ్రామాలకు చెందిన ప్రజల ఇబ్బందులను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

కార్యాలయాల ఏర్పాటుకు కృషి



నర్సాపూర్ డివిజన్ కేంద్రంలో ఆయా శాఖల డివిజన్ స్థాయి కార్యాలయాలు ఏర్పాటు చేసేందుకు నావంతు కృషి చేస్తాను. లోక్‌సభ ఎన్నికల అనంతరం డీజీపీని కలిసి డీఎస్పీ ఆఫీసు ఏర్పాటుతో పాటు ఇతర శాఖల కార్యాలయాల కోసం ఆయా శాఖల ఉన్నతాధికారులను కలిసి డివిజన్ కార్యాలయాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తాను. – సునీతారెడ్డి, ఎమ్మెల్యే

క్లుప్తంగా

ప్రమాదాల నియంత్రణకు చర్యలు: ఏఎస్పీ


వివరాలు తెలుసుకుంటున్న సంజీవరావు

కల్హేర్‌(నారాయణఖేడ్‌): రోడ్డు ప్రమాదాలు జరగకుండా నియంత్రణ చర్యలు తీసుకుంటామని అడిషనల్‌ ఎస్పీ సంజీవరావు తెలిపారు. మంగళవారం మండలంలోని బాచేపల్లి, మాసాన్‌పల్లి, తదితర చోట్ల సంగారెడ్డి–నాందేడ్‌ 161 జాతీయ రహదారిపై ఇటీవల రోడ్డు ప్రమాదాలు జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఇక్కడ చోటుచేసుకున్న ప్రమాదాల గురించి ఆరా తీశారు. ఇవి జరగకుండా ముందస్తు చర్యలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో ఖేడ్‌ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, ఎస్‌ఐ వెంకటేశం పాల్గొన్నారు.

దుకాణాలపై టాస్క్‌ఫోర్స్‌ దాడులు


షాపులో టాస్క్‌ ఫోర్స్‌ కమిటీ సభ్యులు

హుస్నాబాద్‌: పట్టణంలోని సింగిల్‌ యూస్‌ ప్లాస్టిక్‌ దుకాణాలపై మంగళవారం సిటీ లెవల్‌ టాస్క్‌ ఫోర్స్‌ కమిటీ సభ్యులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ప్లాస్టిక్‌ కవర్లు, ప్లాస్టిక్‌ స్పూన్లు, 120 మైక్రాన్‌ల కంటే తక్కువ ఉన్న ప్లాస్టిక్‌ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. పలు బేకరీల్లో కాలపరిమితి నిండిన వస్తువులను అమ్ముతున్న ఈ షాపుల యజమానులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కిరాణా షాపుల్లో చైనా మాంజా దారం అమ్మకూడదని, అసలు దాన్ని వాడకూడదన్నారు. వేరే రాష్ట్రాల నుంచి కానీ, జిల్లాల నుంచి కానీ దిగుమతి చేసుకోవద్దని సూచించారు. ఈ దాడుల్లో సిటి లెవల్‌ టాస్క్‌ ఫోర్స్‌ కమిటీ సభ్యులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ బాల ఎల్లం, ఆర్‌ఐ శంకర్‌, ఎన్విరాన్‌మెంట్‌ ఇంజినీర్‌ రవికుమార్‌, వార్డు ఆఫీసర్లు భవానీ, శారద, సాంబరాజు, సిస్టమ్‌ మేనేజర్‌ అరవింద్‌, కోటి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

టీచర్‌ అదృశ్యం


నాగరాజు

చేగుంట(తూప్రాన్‌): ఉపాధ్యాయుడు అదృశ్యమైన సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం .. పట్టణంలోని ఒక ఇంటిని అద్దెకు తీసుకొని నాగరాజు నివాసముంటున్నాడు. అతను మాసాయిపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. గురువారం విధులు ముగించుకున్న అనంతరం పట్టణానికి వచ్చి సెల్‌ గృహంలోనే ఉంచి ఎక్కడికో వెళ్లిపోయాడు. దానికి కాల్‌చేయగా ఎత్తడం లేదని కుమారుడు వంశీధర్‌ ఇక్కడికి వచ్చి చూస్తే కనిపించడం లేదు. బంధువుల ఇళ్లలో ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో పోలీసులకు వంశీధర్‌ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బాలరాజు తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడికి 4 ఏళ్ల జైలు

హవేళిఘణాపూర్‌(మెదక్‌): పోక్సో కేసులో వ్యక్తికి నాలుగేళ్ల జైలు శిక్ష, రూ. 20వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన సెషన్స్‌ జడ్జి లక్ష్మీశారద తీర్పునిచ్చినట్లు హవేళిఘణాపూర్‌ ఎస్‌ఐ ఆనంద్‌గౌడ్‌ తెలిపారు. మండల పరిధిలోని బూర్గుపల్లి గ్రామానికి చెందిన గుల్లకుంట బాబు ఇదే గ్రామానికి చెందిన యువతిని చేయిపట్టుకొని బలవంతం చేయడంతో పాటు తన అమ్మని చంపేస్తానని బెదిరించినట్లుగా కేసు నమోదైంది. కాగా విచారణలో నేరం రుజువు కావడంతో పై శిక్ష, జరిమానాను జడ్జి విధించారని ఎస్‌ఐ తెలిపారు.

సాగు నీటి రాజకీయం

స్థానిక రాజకీయాలు రైతుల పాలిట శాపంగా మారుతున్నాయి. వరి పంటలు ఎండటంతో పశువులకు మేతగా వదిలేస్తున్నారు. తపాస్‌పల్లి రిజర్వాయర్‌ నుంచి నీరు విడుదలైనా చెరువుల్లోకి ఇంకా చేరలేదు. వారం రోజుల నుంచి ఇదే పరిస్థితి ఉండటంతో లబోదిబోమంటున్నారు. అధికారంలో తాము లేమని ఒక పార్టీ.. అధికారంలో ఉండి కూడా గ్రూపు రాజకీయాలు మధ్య రైతులు నలిగిపోతున్నారు. ఇప్పటికైనా వాటిని పక్కనబెట్టి దేశానికి వెన్నెముకైనటువంటి రైతులకు అండగా నిలబడాలని పలువురు కోరుతున్నారు.

- వారం క్రితమే తపాస్‌పల్లి రిజర్వాయర్‌ నుంచి విడుదల
- కొండపాక మండలంలోని చెరువులకు చేరని జలం
- ఎండిపోతున్న పంటలు, ఆందోళనలో రైతులు


తపాస్‌పల్లి రిజర్వాయర్‌ నుంచి నీరు చేరకపోవడంతో ఎండిపోయిన కొండపాకలోని పోతిరెడ్డి చెరువు

కొండపాక(గజ్వేల్‌): తపాస్‌పల్లి రిజర్వాయర్‌ నుంచి కొండపాక మండలానికి సాగు నీరు అందించడంలో కాంగ్రెస్‌ పార్టీలో నెలకొన్న గ్రూప్‌ విభేదాలు రైతులను అయోమయానికి గురి చేస్తున్నాయి. రిజర్వాయర్‌ నుంచి సాగు నీరు చేర్యాల, కొమురవెల్లి, బచ్చన్నపేట మండలాలకు వెళ్లేలా అక్కడి నాయకులు ప్రత్యేక చొరవ చూపుతున్నారు. నీరు విడుదల చేసి వారం రోజులైనా కొండపాక మండలంలోని ఏ ఒక్క చెరువులోకి సాగు నీరు చేరకపోవడంతో నాయకత్వం లోపం తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది వర్షాభావ పరిస్థితులకు తోడుగా ఎండలు ముదరడంతో చెరువుల్లో నీటి నిల్వలు విపరీతంగా తగ్గిపోయాయి. దీంతో బోరుబావుల నుంచి రోజు రోజుకు నీరు తక్కువగా బయటకు వస్తుండటంతో వరి పంటలను కాపాడుకునేందుకు రైతులు అధిక భారాన్ని భరిస్తూ ట్యాంకరుల ద్వారా నీటి తడులు అందజేస్తున్నారు. యాసంగిలో 22,023 వేల ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. ప్రస్తుతం పొట్ట దశకు చేరుకోవడంతో నీటి తడులు అధికంగా అవసరపడతాయి. ఒకవేళ లేదంటే ధాన్యం గింజలు బలపడక తాలుగా మారే అవకాశం ఉంటుందని రైతులు పేర్కొన్నారు.

10 ఏళ్ల బీఆర్‌ఎస్‌ హయాంలో మార్చి నెలలో తపాస్‌పల్లి రిజర్వాయర్‌ నుంచి గ్రావిటీ ప్రకారం కొండపాక మండలంలోని చెరువులను నింపుతూ పంటలు ఎండిపోకుండా కాపాడుకుంటూ వచ్చింది. ఇప్పుడు కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి ఉండటంతో నాయకులు ఆదిశగా ప్రయత్నాలు చేపట్టకపోవడంతో దాదాపుగా చాలా గ్రామాల్లో వరి పంటలు ఎండిపోయాయి. దీంతో రైతులు వరి పొలాల్లో పశువులను తోలడంతో పాటు మరి కొన్ని చోట్ల పశువులకు కోసి వేస్తూ తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. సాగు నీటి ఇబ్బందులపై ఇటీవల సాక్షి దినపత్రికలో ప్రత్యేక కథనాలు ప్రచురితమయ్యాయి. స్పందించిన కాంగ్రెస్‌ నాయకులు, అధికారులు తూతూ మంత్రంగా తపాస్‌పల్లి రిజర్వాయర్‌ నుంచి కొండపాక మండలానికి సాగు నీటిని విడుదల చేసి వదిలేశారు. కాంగ్రెస్‌ నాయకుల్లో ఉన్న గ్రూప్‌ విభేదాలు సాగు నీరు విడుదల చేయడం, చెరువుల వరకు నీరు చేరడంపై పడింది. రిజర్వాయర్‌ నుంచి నీరు విడుదల చేసి వారం రోజులైనా మండలంలోని ఏ ఒక్క చెరువులోకి నీరు చేర లేదు.


మర్పడ్గలో ఎండిపోయిన వరి చేనును మేస్తున్న ఆవులు

పార్టీలో చేరికలపైనే ప్రత్యేక శ్రద్ధ

బీఆర్‌ఎస్‌లో నుంచి కాంగ్రెస్‌లో నాయకులను, కార్యకర్తలను చేర్పించడంలో చూపుతున్న శ్రద్ధ ప్రజా సమస్యల పరిష్కారంలో అధికార పార్టీ ముఖ్య నాయకులు చూపడం లేదని ప్రచారం సాగుతోంది. నూతనంగా కాంగ్రెస్‌లో చేరిన నాయకులు పార్టీ తరపున నియామక మయ్యే కార్పొరేట్‌ పదవులను దక్కించుకునే విషయంపై ముఖ్య నాయకులపై ఒత్తిడి పెంచుతున్నారు తప్ప సమస్యలను మాత్రం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం లేదన్న విషయం స్థానికంగా చర్చకు దారితీస్తోంది. ఇదిలా ఉండగా రైతుల సమస్యలు పట్టించుకునే విషయమై .. అధికారం కోల్పోయమని బీఆర్‌ఎస్‌ నాయకులు, అధికారంలో ఉండి కూడా కాంగ్రెస్‌లో తలెత్తిన గ్రూప్‌ విభేదాల మధ్య ప్రజలను ఇబ్బందికి గురి చేస్తుంది. ఇలాగే కొనసాగితే లోక్‌సభ ఎన్నికల్లో పార్టీలకు నష్టం జరగకుండా ఉండాలంటే సాగునీరు విడుదల చేయాలంటున్నారు.

బైక్‌ను ఢీకొన్న లారీ

- ఇద్దరు మైనర్ల మృతి
- రాంనగర్‌ సర్కిల్‌ వద్ద ఘటన

జహీరాబాద్‌ టౌన్‌: బైక్‌ను లారీ ఢీకొన్న ఘటనలో ఇద్దరు మైనర్లు మృతిచెందారు. పట్టణంలోని రాంనగర్‌ సర్కిల్‌ వద్ద ఈ ఉదంతం మంగళవారం జరిగింది. ఎస్‌ఐ లక్ష్మారెడ్డి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ఖాన్‌ మోహల్లాలోని 3వ వార్డులో నివాసం ఉంటున్న సమద్‌ కుమారుడు నవీద్‌(14), ఖాలిద్‌ కుమారుడు రియాన్‌(17)లు బంధువులు. వీరి మేనమామ షేక్‌ మొహీన్‌ ఎస్‌బీహెచ్‌ కాలనీలో నివాసం ఉంటున్నారు. సోమవారం రాత్రి ఎస్‌బీహెచ్‌ కాలనీలో ఉన్న మామ ఇంటికి ఇద్దరు కలిసి వెళ్లారు. మంగళవారం ఉదయం మామకు చెందిన బైక్‌ తీసుకుని బయటకు వెళ్లారు. రియాన్‌ బైక్‌ నడుపుతుండగా నవీద్‌ వెనుక కుర్చున్నాడు. పట్టణం నుంచి బీదర్‌ చౌరస్తా వైపు వెళ్తుతుండగా రాంనగర్‌ చౌరస్తా వద్ద ఎదురుగా వస్తున్న లారీ.. బైక్‌ను ఢీకొట్టింది. దీంతో నవీద్‌ అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రగాయాలైన రియాన్‌ను జహీరాబాద్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం సంగారెడ్డి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో చనిపోయాడు. సంఘటన స్థలాన్ని డీఎస్పీ రాం మోహన్‌రెడ్డి, సీఐ రవి సందర్శించారు. సమద్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లక్ష్మారెడ్డి తెలిపారు. మైనర్ల కుటుంబసభ్యులను ఎమ్మెల్యే మాణిక్‌రావు పరామర్శించారు.


రియాన్‌, నవీద్‌(ఫైల్‌)

సైబర్‌ నేరాలపై అప్రమత్తం

సిద్దిపేట సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్‌: సైబర్‌ నేరగాళ్ల మోసాల బారిన పడకుండా జిల్లా ప్రజలు జాగ్రత్త వహించాలని సిద్దిపేట పోలీసు కమిషనర్‌ అనురాధ తెలిపారు. నేరాల నియంత్రణలో భాగంగా పోలీసు కమిషనర్‌ కార్యాలయంలో సైబర్‌ వారియర్స్‌కు ఆమె మంగళవారం నూతన ఫోన్‌లు, సిమ్‌ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సైబర్‌ బాధితులకు మెరుగైన సేవలను అందించేందుకే సైబర్‌ వారియర్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో జిల్లాలో సైబర్‌ క్రైమ్‌ యూనిట్‌ ఏర్పాటు చేస్తున్నట్లు, దీంతో బాధితులకు మెరుగైన సేవలు అందించవచ్చన్నారు. ఈ కేసుల్లో పూర్తి స్థాయి ఆధారాలు సేకరించి నేరస్తులను గుర్తించడం, శిక్ష పడేట్లు చేయాలన్నారు. పూర్తి స్థాయిలో టెక్నాలజీపై పట్టు ఉన్న సిబ్బంది ద్వారా ప్రజలకు సేవలందిస్తామన్నారు. టెక్నాలజీపై పలు అంశాలపై సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. సైబర్‌ మోసాలకు గురైన బాధితులు వెంటనే జాతీయ హెల్ప్‌లైన్‌ నంబర్‌ 1930కు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ సేవలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోలీసు స్టేషన్‌ వారీగా సైబర్‌ వారియర్స్‌ ఫోన్‌ నంబర్లను అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో సైబర్‌ క్రైమ్‌ పోలీసు స్టేషన్‌ ఏసీపీ శ్రీనివాస్‌, ఇన్‌స్పెక్టర్‌ శేఖర్‌, సైబర్‌ పోలీసు స్టేషన్‌ సిబ్బంది రాము, హరీశ్‌, సైబర్‌ వారియర్స్‌ సిబ్బంది పాల్గొన్నారు.


సైబర్‌ వారియర్స్‌కు సిమ్‌ కార్డులు అందజేస్తున్న సీపీ అనురాధ

ఈఎంఐ తెచ్చిన తంటా

- క్షణికావేశంలో కారుకు నిప్పు
- ఆపై ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడు
- ఆస్పత్రికి తరలింపు

మిరుదొడ్డి(దుబ్బాక): ఈఎంఐ విషయమై ఇద్దరి మధ్య రాజుకున్న వివాదంలో కారుకు నిప్పు పెట్టారు. ఆపై ఆత్మహత్యాయత్నం చేశారు. ఈ ఘటన మిరుదొడ్డిలో మంగళవారం చోటుచేసుకుంది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన సోహెల్‌ 5 నెలల క్రితం తన తల్లి బంగారు నగలు అమ్మగా డబ్బులొచ్చాయి. ఇదే గ్రామానికి చెందిన సద్దాం హుస్సేన్‌ వద్ద కారు కొన్నాడు. ముందుగా రూ. 40 వేలు చెల్లించాడు. కాగా ఆర్థిక పరమైన ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. అప్పటికే ఈఎంఐ చెల్లించ లేదు. హుస్సేన్‌కు ఫైనాన్స్‌ నిర్వాహకులు ఒత్తిడి తీసుకువచ్చారు. దీంతో 2 నెలల క్రితం సోహెల్‌ నుంచి కారును తీసుకెళ్లాడు. కారు కొనుగోలు చేస్తున్న సమయంలో చెల్లించిన డబ్బులను తిరిగివ్వాలని సోహెల్‌ 2 నెలల నుంచి అడుగుతున్నాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చెలరేగింది. క్షణికావేశంలో ఉన్న సోహెల్‌ తన సెల్‌ఫోన్‌ ద్వారా వీడియోను చిత్రీకరిస్తూ కొత్త బస్టాండ్‌ వద్ద ఉన్న కారు అద్దాలను పగుల గొట్టి పెట్రోల్‌ పోసి నిప్పంటించాడు. కారు లోపలి భాగం నుంచి మంటలు ఎగసి పడుతుండటంతో పాటు ఆత్మహత్యాయత్నం చేశాడు. దీంతో అతని ఛాతి, చేతులు, ముఖానికి మంటలు అంటుకుని తీవ్రంగా గాయపడ్డాడు. ఇది గమనించిన స్థానికులు మంటలను ఆర్పివేశారు. విషయం తెలుసుకున్న మిరుదొడ్డి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని జరిగిన సంఘటనపై ఆరా తీశారు. క్షతగ్రాతుడిని సిద్దిపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మరింత మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు.


కాలిపోయిన కారులోని లోపలి భాగం

పీఓ, ఏపీఓలు కీలకం

అసిస్టెంట్‌ ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి పాండు

జోగిపేట (అందోల్‌): ఎన్నికల నిర్వహణలో పీఓ, ఏపీఓల పాత్ర కీలకమని, సమర్థవంతంగా విధులు నిర్వహించాలని అసిస్టెంట్‌ ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి పాండు తెలిపారు. ప్రిసైడింగ్‌ ఆఫీసర్‌, అసిస్టెంట్‌ ప్రిసైడింగ్‌ ఆఫీసర్లకు స్థానిక నెహ్రూ మోమోరియల్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజులుగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గతంలో అనేక సార్లు ఈ తరహా విధులు నిర్వహించామనే నిర్లక్ష్యపు ధోరణిలో ఉండవద్దన్నారు. 734 మంది ప్రభుత్వ ఉద్యోగులు శిక్షణ పొందారన్నారు. ఎన్నికల విధుల్లో ఉండే ప్రతి ఉద్యోగి పోస్టల్‌ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలన్నారు. పోలింగ్‌కేంద్రాల్లో బ్యాలెట్‌, కంట్రోల్‌ యూనిట్లు, వీవీ ప్యాట్లను అమర్చడం, మాక్‌ పోలింగ్‌ నిర్వహణపై, ఫాం నంబర్‌ 12పై మాస్టర్‌ట్రైనర్లు అవగాహన కల్పించారు. ఈ నెల 4,6వ తేదీల్లో ఓపీఓలకు శిక్షణ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వివిధ మండలాల తహసీల్దార్‌లు భాస్కర్‌ కుమార్‌, తెన్‌మోజీ సుబ్రమణ్యం, సతీష్‌, శ్రీనివాస్‌ మాస్టర్‌ ట్రైనర్లు శ్రీకాంత్‌, మౌలానా, రాజమల్లు, ఎలక్షన్‌ డిప్యూటీ తహసీల్దార్‌ చంద్ర శేఖర్‌, అందోల్‌ డిప్యూటీ తహసీల్దార్‌ మధుకర్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అధికారులు

జీవితంపై విరక్తితో ఇద్దరు ఆత్మహత్య

రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఘటనలు


శ్రీనివాస్‌(ఫైల్‌)

మనోహరాబాద్‌(తూప్రాన్‌): ఆర్థిక సమస్యలకు తోడు అనారోగ్య సమస్యలు వెంటాడుతుండటంతో జీవితంపై విరక్తి చెందిన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మనోహరాబాద్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. మంగళవారం ఎస్‌ఐ కరుణాకర్‌ రెడ్డి, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం .. మండలంలోని ముప్పిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కందల శ్రీనివాస్‌ (42) వ్యవసాయం సాగకపోవడంతో కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కాగా శ్రీనివాస్‌ ఆరోగ్యం సరిగ్గా ఉండక పోవడం, పని చేయక పోవడంతో ఆర్థిక సమస్యలు వెంటాడాయి. దీంతో సోమవారం పొలం వద్దకు వెళ్తున్నానని చెప్పి వెళ్లిన వ్యక్తి రాత్రి అయినా ఇంటికి రాలేదు. మంగళవారం ఉదయం స్థానికులు చెట్టుకు ఉరివేసుకుని ఉన్న అతని మృతదేహాన్ని చూసి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి వెళ్లిన వారు కన్నీరుమున్నీరయ్యాయి. భార్య కందల పద్మ ఫిర్యాదు మేరకు కేసు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


వీరాసింగ్‌ (ఫైల్‌)

శివ్వంపేట(నర్సాపూర్‌): ఆర్థిక ఇబ్బందులతోపాటు కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని నవాబుపేటలో మంగళవారం జరిగింది. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం ... గ్రామంలో రాములు తండాకు చెందిన వీరాసింగ్‌(36) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతోపాటు కుటుంబంలో కలహాలు జరుగుతున్నాయి. దీంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని మృతదేహాన్ని పరిశీలించారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి అన్నారు.

నడచుకుంటూ వెళ్తుండగా..

కారు ఢీ కొని వ్యక్తి మృతి

ఓఆర్‌ఆర్‌ సర్వీస్‌ రోడ్డుపై ఘటన

జిన్నారం(పటాన్‌చెరు): నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టగా అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన జిన్నారం మండలంలో సోమవారం రాత్రి జరిగింది. బొల్లారం సీఐ గంగాధర్‌ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ఖాజీపల్లి గ్రామ శివారు ఓఆర్‌ఆర్‌ సర్వీస్‌ రోడ్డు పక్క నుంచి షేక్‌ ఇషాక్‌(50) నడుచుకుంటూ వెళ్తున్నాడు. వెనుక నుంచి వేగంగా వస్తున్న కారు అదుపు తప్పి అతడిని ఢీకొట్టింది. దీంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఇషాక్‌ కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

తాళం వేసిన ఇంటికి కన్నం

- బీరువాలో దాచిన రూ. 11.50 లక్షల నగదు తస్కరణ
- చేగుంటలో ఘటన

చేగుంట(తూప్రాన్‌): తాళం పగులగొట్టి ఇంట్లో చోరీ చేసిన ఈ సంఘటన మండల కేంద్రంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. స్థానికుడైన సోమ మల్లేశ్‌ ఇటీవల వ్యవసాయ పొలం విక్రయించగా వచ్చిన డబ్బులు బీరువాలో దాచాడు. సోమవారం రాత్రి ఇంటికి తాళం వేసిన అతను ధాన్యం కుప్పల వద్దకు వెళ్లగా.. కుటుంబీకులు మక్కరాజీపేట పెద్దమ్మ ఉత్సవాలకు వెళ్లారు. దీంతో వేసిన తాళాన్ని దొంగలు పగులగొట్టి బీరువాలో దాచిన రూ.11.50 లక్షలను దోచుకెళ్లారు. మంగళవారం ఉదయం ఇంటికొచ్చి చూస్తే తలుపులు తెరిచి ఉన్నాయి.. లోపలికి వెళ్లి చూస్తే బీరువాలో ఉండాల్సిన నగదు కనిపించడం లేదు. దీంతో చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి డీఎస్పీ వెంకట్‌రెడ్డి, రామాయంపేట సీఐ వెంకటేశ్‌, ఎస్‌ఐ బాలరాజు చేరుకొని పరిశీలించి వివరాలను సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.


బాధితుడితో మాట్లాడుతున్న పోలీసులు

బడ్జెట్‌ కేటాయింపు ఏదీ?

రాష్ట్ర వ్యాప్తంగా రాయితీ గడ్డి విత్తనాల పంపిణీ సరఫరా కాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యాసంగి ఆరంభంలోనే ప్రతి ఏటా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బడ్జెట్‌ కేటాయించేది. కానీ ఈ సారి కేటాయించకపోవడంతో సరఫరా నిలిచిపోయింది. జిల్లా వ్యాప్తంగా దాదాపు 20 మెట్రిక్‌ టన్నుల గడ్డి విత్తనాల అవసరం ఉంది. దీంతో పశు గ్రాసం దొరక్కపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పేలా లేదు. గత వానాకాలం వరి కోతలు అధిక శాతం యంత్రాలతో చేపట్టడంతో గ్రాసం అందకుండా పోయింది.

- నిలిచిపోయిన రాయితీ గడ్డి విత్తనాల సరఫరా
- పశుగ్రాసం పెంచడానికి తప్పని ఇబ్బందులు
- రైతుల ఎదురుచూపులు


మల్కాపూర్‌ శివారులో సాగవుతున్న పశుగ్రాసం(ఫైల్‌)

జిల్లా వివరాలు	
పశువులు	2.80 లక్షలు
మేకలు	1.92 లక్షలు
గొర్రెలు	3.85 లక్షలు

పెద్దశంకరంపేట(మెదక్‌): జిల్లాలో పశుగ్రాసం కొరతను అధిగమించేందుకు పశు పోషకులకు పశు సంవర్ధక శాఖ ద్వారా 75 శాతం రాయితీపై ఏటా గడ్డి విత్తనాలు సరఫరా చేస్తోంది. ఈ విత్తనాలను ప్రతి ఏడాది డిసెంబర్‌, జనవరి నెలల్లో పశువైద్యశాలలకు చేర్చి అక్కడి నుంచి రైతులకు అందజేస్తారు. ఈ ఏడాది ప్రభుత్వం రాయితీ విత్తనాలకు సంబంధించి బడ్జెట్‌ కేటాయించకపోవడం వల్ల ఈసారి పంపిణీ నిలిపోయినట్లేనని సంబంధిత శాఖ అధికారులు పేర్కొన్నారు. మార్చి నెలాఖరు వరకు రావాల్సి ఉన్నా ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు రాలేవని అంటున్నారు. రైతులు తమ పంట పొలాల వద్ద ఖాళీ స్థలాల్లో గడ్డి విత్తనాలు వేసి పశుగ్రాసాన్ని పెంచుకుంటారు. గతంలో రూ.65కు 5 కిలోల బస్తాను రైతులకు సబ్సిడీపై అందించే వారు. పశువులను బట్టి ఎకరాకు 30 కిలోల విత్తనాల అవసరం ఉంటుంది. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రూ.100లకు రైతులు కొంటున్నారు. దీంతో ఆర్థిక భారంతో పాటు సాగు చేయడానికి వెనుకంజ వేయాల్సి రావడం, బయట మార్కెట్‌లో గడ్డిని కొనుగోలు చేయాలంటే ఎక్కువ డబ్బును ఖర్చు చేయడం వంటి సమస్యలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి.

ముందస్తుగా గుర్తిస్తే ఇబ్బందులు తప్పేవి

యాసంగి ఆరంభంలో పంపిణీ చేసే గడ్డి విత్తనాలను రైతులు వేసవిని దృష్టిలో పెట్టుకుని సాగు చేసేవారు. దీని వల్ల పశు గ్రాసం కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టేవారు. వాటి కోసం పశువుల పెంపకం చేపట్టే పాడి రైతులు పశు వైద్యశాలల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అవి సరఫరా కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. కొందరు రైతులు తప్పని పరిస్థితుల్లో ప్రైవేటు దుకాణాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. కానీ ఏటా మెదక్‌ జిల్లాకు దాదాపు 20 మెట్రిక్‌ టన్నుల వరకు పంపిణీ చేసేవారు.

త్వరలో వచ్చే అవకాశం

జిల్లాకు త్వరలో రాయితీ గడ్డి విత్తనాలు వచ్చే అవకాశం ఉంది. ఈసారి ఎలాంటి బడ్జెట్‌ కేటాయింపులు లేకపోవడంతో సరఫరా ఆలస్యమైంది. జిల్లాకు 20 మెట్రిక్‌ టన్నుల గడ్డి విత్తనాల కోసం నివేదికలు పంపించాం. దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

– వెంకటయ్య, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి

మొక్కజొన్న మాటున గంజాయి సాగు


గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్‌ పోలీసులు

- గుట్టురట్టు చేసిన ఎక్సైజ్‌ పోలీసులు
- 82 మొక్కలు స్వాధీనం.. విలువ రూ.8.20 లక్షలు

ఝరాసంగం : మొక్కజొన్న మాటున గంజాయి సాగు చేస్తున్న వ్యవహారాన్ని ఎక్సైజ్‌ పోలీసులు గుట్టురట్టు చేశారు. ఈ సంఘటన మండలకేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.... సిద్దాపూర్‌ గ్రామ శివారులో రైతు జొన్న పంటలో గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని సాగు చేస్తున్నాడు. నమ్మదగిన సమాచారం మేరకు ఎక్సైజ్‌ సీఐ శ్రీనివాస్‌ రెడ్డి, ఎస్‌ఐలు రమేష్‌, మురళి బృందం సభ్యులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఇందులో 82 గంజాయి మొక్కలు స్వాధీనపరుచుకున్నారు. ఆపై కేజీ ఎండు గంజాయిని స్వాధీన చేసుకున్నారు. మొక్కల విలువ రూ. 8.20 లక్షలు, ఎండు గంజాయి విలువ రూ.25వేలు ఉంటుందని ఎక్సైజ్‌ పోలీసులు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్‌ సిబ్బంది సురేష్‌, గణేష్‌ తదితరులు పాల్గొన్నారు.